ఎదిగిన కొడుకు

రైలు బండిలో కిటికీకి దగ్గరగా కూర్చున్న రమణకు ఆలోచనలు అతి వేగంగా పరుగులు తీస్తున్నాయి. భయమూ, ఆందోళనా పడుగు పేకల్లా అల్లుకుపోతున్నాయి.

అమ్మకు పిచ్చి ఎక్కిందా? పదిహేను-పదమూడు సంవత్సరాలు గల తన చెల్లెళ్ళు ఆమెను కనిపెట్టుకుని ఉంటున్నారా? పదేళ్ళ తమ్ముడు వసంతు అమ్మను వదిలి ఉండలేక ఆమె దగ్గరే ఉన్నాడా?

అమ్మకు పిచ్చెక్కిందంటే అందరినీ కొడుతూ తిడుతూ ఉంటుందికాబోలు! అటువంటి స్థితిలో ఉన్న అమ్మను చిన్న పిల్లలు ఎట్లా కనిపెట్టుకుని ఉంటున్నారు?

ఈ సంగతి నమ్మటానికి మనసు మొరాయిస్తున్నది. అతడు ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులను చూసి దాదాపు మూడు సంవత్సరాలు కావచ్చింది. శ్రద్ధగాచ దివి పరీక్షలు ప్యాసవ్వాలని ప్రతివారం తండ్రి ఉత్తరం వ్రాస్తాడు సెలవుల్లో ఏవైనా కొత్త కొత్త ఊళ్ళు తిరిగి రమ్మని డబ్బు పంపుతాడు. అంతా క్షేమంగా ఉన్నారు, నీవు బెంగ పెట్టుకోవద్దని ధైర్యం చెబుతూ ఉత్తరాలు వస్తున్నాయి.

కాని—రమణకు చెల్లెళ్ళనూ తమ్ముడినీ చూడాలని ఉంది. తల్లి దగ్గిర రెండు రోజులయినా ఉండి ఆమె చేతి భోజనం చేయాలని ప్రాణం కొట్టుకు పోతున్నది. కాని అదెలా సాధ్యమో అతడికి అర్థం కాలేదు. తండ్రి చండ శాసనుడు. ఆయన కెదురు పలకటం ఆ యింట్లో ఎవరికీ అలవాటు లేదు.

శూన్యంలోకి చూస్తున్నాడు రమణ. కళ్ల నీళ్ళు ఉబికి ఉబికి వస్తున్నాయి. తనకీ సంగతి తండ్రి ఎందుకు వ్రాయలేదు? తనను ఇంటికి దూరం చేస్తున్నాడెందుకు తన తండ్రి ? తన తల్లి సంగతి తనకు తెలియకుండా ఎందుకు దాస్తున్నాడు ? తనకు ఇంటి కష్టసుఖాలు తెలుసుకో

వలసినంత వయసుంది. బాధ్యత వహించవలసిన హోదా ఉంది. తండ్రి తర్వాత ఆ కుటుంబపు మంచి చెడ్డలు చూడవలసినవాడు తనే.

పరమేశంగారు చెప్పినప్పుడు తను నమ్మలేకపోయాడు. తండ్రి మీద తన కెంత ప్రేమో ఆయనమీద అంత భక్తి గౌరవాలున్నాయి. ఆయనను గురించి ఎవరేమి చెడుగా చెప్పినా వినలేడు—నమ్మలేడు.

"రమణా! నీవు ఇంటికి వెళ్ళి ఎన్నాళ్ళయింది?" అని పరమేశంగారు అడిగినప్పుడు అలా ప్రశ్నిస్తాడేమిటనిపించింది.

"ఈ మధ్య వెళ్ళలేదండీ" అన్నాడు.

"ఈ మధ్య అంటే కొన్నేళ్ళనుంచీ వెళ్ళ లేదా?" ఆశ్చర్యపోయా డాయన.

"అవునండీ" అన్నాడు సామాన్యంగా.

"బాబూ! ఒక మాట. ఇంటికి వెళ్ళి నీ వాళ్ళందరినీ ఒక మాటు చూసిరా. నీవు నీ వాళ్ళకు దూరం కాకూడదు." అన్నాడు.

"పరీక్షలండీ పరీక్షలు. సరిగ్గా చదవకపోతే మా నాన్న సంగతి తెలుసుగా? తాట ఒలిచేస్తాడు"

"పరీక్షలేం కొడతాయా? ఇంటికి వెళ్ళి అందరినీ చూసి వచ్చి రాత్రింబగళ్లూ చదువుకో."

ఎంతో బలవంతం చెయ్యగా చెప్పాడు తల్లిని గురించి.

అతడికి షాకు తగిలినట్లయింది. తనకా సంగతే తెలియదే? ఎందుకిలా జరిగింది? కారణం?

రైలు దిగి తోలుపెట్టె చేతబట్టుకుని ఆ ఊరు చిన్నదే కనుక కాలినడకన బయలుదేరాడు పరమేశంగారు చెప్పిన ఆనవాళ్ళుగల ఇంటిముందు ఆగి అడుగుతున్నాడు

వీధిలోకి తలుపు ఉన్న చిన్నగది. ఓరవాకిలిగా తలుపులు వేసి వున్నాయి. వాటి మధ్య ఒక అమ్మాయి తల బైటికిపెట్టి చూస్తోంది ఒక్క అంగలో సమీపించి "చంద్రా!" అన్నాడు రమణ.

"అన్నయ్యా ఇప్పుడే వస్తున్నావా?" చంద్ర అన్నను సంభ్రమంతో చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది. తల్లి అప్పుడే కుంపటి మీద వంట చేసినట్టుంది. పిల్లలకు పళ్ళేలలో వడ్డించింది. గోడవారగా చాపమీద పడుకున్న వసంతను జ్వరం తగ్గిన తరువాత అన్నం పెడతానని బ్రతిమిలాడుతున్నది.

రమణను చూడగానే "ఎట్లా వచ్చావురా? ఎప్పుడు వచ్చావురా? నాయనా! నిన్ను చూసి ఎన్నాళ్ళయిందిరా?" చేతులతో అతడిని చుట్టివేసింది.

ఆమెను చూడగానే రమణకు పుట్టెడు దుఃఖం వచ్చింది. కష్టం మీద అణచుకున్నాడు.

"వసంతకు జ్వరంరా. ఇవాళ్టికి నాలుగు రోజులయింది డాక్టరు మంచి వాడు. ధైర్యం చెబుతూ జాగ్రత్తగా మందిస్తున్నాడు. నాయనా! ఎప్పుడుబయలు దేరావో? స్నానం చెయ్యి భోజనం చేద్దువు గాని" కుంపటిలో బూడిద దులిపి మళ్ళీ బొగ్గులు వేసి బియ్యం కడిగి పెట్టింది.

"వసంతుకంత జ్వరంగా ఉంటే నాన్నగారి కెందుకు ఉత్తరం వ్రాయలేదు? అయినా మీరీ ఊళ్ళో కాపరం ఏమిటి? ఈ చిన్న పిల్లలను పెట్టుకుని నీవు ఒక్క దానవు ఈ ఊళ్ళో ఎందుకున్నట్లు?" ఎంతో బాధపడుతూ — చాప మీద చతికిల పడ్డాడు రమణ.

"బాబూ! నాన్నగారికి ఊళ్ళు తిరిగే ఉద్యోగమయిపోయింది. ఈ పిల్లల చదువులకు ఇబ్బందవుతుందని ఇక్కడ ఉంచారు?" అన్నది తల వంచుకుని.

పాత పెంకుటింట్లో ముందరి గది — వర్షాకాలంలో వర్షమంతా ఆగదిలోనే ఉండేటట్టుంది. గోడలు మాసి నల్లగా బొగ్గు మరకలతో అసహ్యంగా ఉన్నాయి. రెండు పాత ట్రంకు పెట్టెలు-రెండు జంపఖానాలు-ఒక చాప కనబడుతున్నాయి వంట సామాను చాలా స్వల్పంగా ఉంది. తల్లి చెప్పే కబుర్లు చూస్తే అతడికి అయోమయంగా ఉంది. ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తున్నది. మరి మతిభ్రమణ మేమిటి? అతడికి అంతుబట్టలేదు.

స్నానంచేసి భోజనానికి కూర్చున్నాడు. తల్లి చేతి వంట ఎంత రుచిగా ఉంది? ఇదివరకటికంటె ఆమె చేతి భోజనము మరింత కమ్మగా ఉంది. ప్రేమతో

కొసరి కొసరి వడ్డించింది. అతడు ప్రసంగ ధోరణిలో తల్లిని ఎప్పటెప్పటి సంగతులో అడిగి పరీక్ష చేశాడు. ఆమె చెప్పిన జవాబులు అతడిని చకితుణ్ణి చేస్తున్నాయి. ఎంతసేపు మాట్లాడించినా ఒక పొల్లు మాటయినా దొర్లటం లేదు.

ఆ సాయంత్రం చెల్లెళ్ళనిద్దరినీ తీసుకుని బజారుకు వెళ్ళాడు, దారిలో "చంద్రా! నాన్నగారెప్పుడయినా వచ్చారా? ఉత్తరాలు వస్తాయా!" అని అడిగాడు.

"ఉత్తరాలు రావుగాని నెలనెలకూ నాలుగు వందల రూపాయలు వస్తాయి. అమ్మ కూడా రాయదు. మమ్మల్ని రాయనివ్వదు. అన్నయ్యా, అమ్మ చాలా మారిపోయింది. ఉన్నదాంట్లో మాకు కావలసినవి కొనిపెడుతుంది. తాను చిరిగి పేలికలై పోయిన చీరెలు కట్టుకుంటుంది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది. మేమడిగితే "మీరు చిన్న పిల్లలు–మీకెందుకంటుంది" చంద్ర కళ్ళు తుడుచుకుంది.

"అన్నయ్యా, నాన్నగారెందుకని ఇక్కడికి వచ్చి ఒక్కసారయినా చూసిపోరు?" అడిగింది తడికళ్ళతో.

"నాకేం తెలియదమ్మా, మీ సంగతులేమీ తెలియకనే నేను ఉత్తరమయినా రాయకుండా వచ్చేశాను" నొచ్చుకున్నాడు రమణ.

"అయితే అన్నయ్యా, నువ్వు నాన్నగారి దగ్గర్నుంచి రావటం లేదూ?"

"లేదమ్మా—లేదు. మిమ్మల్నందరినీ చూసి చాలా రోజులయిపోయిందని ముందుగా ఇక్కడికి వచ్చాను."

"అన్నయ్యా, ఇంకా పది రోజులుండవూ? ఈ ఊళ్ళో మాకేం తోచటం లేదు. పిచ్చెక్కినట్టుగా ఉంది" దీనంగా అతడి కళ్ళల్లోకి చూసింది.

"చంద్రా! నాకూ పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. సరిగ్గా చదవకపోతే నాన్నగారూరుకోరని తెలుసుగా! పరీక్షలవగానే వస్తాను. సరేనా! ఈలోపల మీరు కూడా బాగా చదువుకోండి."

"చదవకపోతే అమ్మ మాత్రం ఊరుకుంటుం దనుకున్నావా? నేనూ— పప్పు పరీక్షలు ప్యాసయ్యాం కనుక సరిపోయింది. లేకపోతేనా? వసంతు ఫస్టున వచ్చాడు తెలుసా?" కళ్ళు తిప్పుతూ అన్నది.

అయితే అమ్మ వెనకటి మాదిరిగానే పిల్లలను క్రమశిక్షణలో ఉంచుతున్నదన్న మాట!

ఆ రాత్రి పిల్లలు పడుకున్న తరువాత తల్లి 'రమణా!' అని పిలిచింది. చేతిలో ఉన్న పేపరక్కడ పడేసి తల్లికి దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"రమణా! నీ కాలేజీలో ఎవరయినా బుద్ధిమంతులయిన పిల్లలు ఉంటే చూడు మనవాళ్ళల్లో" అన్నది.

"ఎందుకమ్మా?" ఆశ్చర్యంతో కనుబొమలు పైకెత్తి చూశాడు తల్లి ముఖంలోకి.

"ఈ రోజుల్లో తొందరే అయినా పుష్పకూ చంద్రకూ పెళ్ళిళ్ళు చేయాలని ఉందిరా." ఆవేదనతో అన్నది.

"వాళ్ళు ఇంకా చిన్నవాళ్ళు కదమ్మా. కనీసం బి. ఎ అయినా ప్యాసవనీ. అంత తొందరెందుకు?" అన్నాడు.

"తొందరెందు కంటావా? వాళ్ళు ఆడపిల్లలు కనుక తొందరపడుతున్నాన" వేదాంతిలా నవ్వింది.

రమణకు బుద్ధి తెలిసినప్పటినుంచీ బాగా గుర్తు - తల్లి ముఖం ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. కోపాన్ని కూడా నవ్వుతూనే వ్యక్తం చేస్తుంది. ఇప్పుడామె ముఖంలో ఆ ఛాయలు కనబడక వెతుక్కున్నాడు. ఆమె ఇంట్లో ఉన్నా చీరె రవిక నలక్కుండా చూసుకునేది. ఆమె తను నిద్రలేచేటప్పటికే తలదువ్వుకుని స్నానం చేసి శుభ్రమయిన చీరె కట్టుకుని ఉండేది. ఇప్పుడామె తలలో దువ్వెనపెట్టి ఎన్నాళ్ళయిందో నన్నట్లున్నది. ఆ చీరె కట్టులో దిద్దుబాటులో ఎంతో నిర్లక్ష్యం కనబడుతోంది కొట్టవచ్చినట్టుగా. ఆ వెలవెలబోయిన చీరెలు అమ్మ ఇదివరలో నౌకర్లకిచ్చేది.

రమణ దృష్టి చప్పున తండ్రి మీదికి మళ్ళింది. తనను మూడేళ్ళనుంచీ ఇంటికి రాకుండా కట్టడి చేస్తున్నాడేం తన తండ్రి-ఎందుకు? తల్లికి పిచ్చి అంటే అసహ్యించుకుంటాడనా? లేక భయపడతాడనా? పిచ్చిదని విరక్తి తెచ్చుకుంటాడనా? అదీ కాకపోతే-మందిప్పించి నయం చేయిస్తాడనా? ఎందుకు? మరెందుకు?

రమణ కాలుగాలిన పిల్లిలా ఆ రాత్రంతా అటూ ఇటూ తిరిగాడు. ఎంతసేపా లోచించినా ఆతడికి అంతు చిక్కటం లేదు.

అతడుండగానే వసంతుకు జ్వరం తగ్గింది. అదీ ఇదీ కావాలని మారాం చేస్తున్నాడు. వాడు కావాలని కోరినవన్నీ తల్లి కొని తెస్తానని వాగ్దానాలు చేసి కాలం గడుపుతున్నది.

రమణ మనసు కొట్టుకుపోతున్నది. వసంతు అడిగిన వస్తువులు తల్లి కొని ఇవ్వవచ్చు. ఆమె తనకు వచ్చే ఆ నాలుగువందలలో చాలా పొదుపుగా వాడుకుని నెలకు పాతిక ఆదా చేస్తున్నట్టు బ్యాంకు పుస్తకం వల్ల తెలిసింది. మొదటి నుంచీ నౌకర్లతో చేయించుకున్న ఆమె - అంట్లు తోముకుని బట్టలుతుకుకొంటూ ఇంటి పని అంతా తనే చేసుకుంటున్నది. ఆమె ఇప్పుడిటువంటి చిల్లర ఖర్చు పెట్టదలచుకోనట్టు కనబడుతున్నది. తన బాల్యం ఆతడికి స్మృతిపథాన మెరిసింది. ఎన్ని ఆట వస్తువులు! చూపినదల్లా పాతికా ఏభయి పెట్టి కొనిఇచ్చాడు తండ్రి. తను నిర్లక్ష్యంగా పారేసుకునేవాడు. ఇప్పుడు వసంతు కోరిన చిన్న వస్తువు కూడా అమ్మ కొనిఇచ్చే స్థితిలో లేదు. తానిప్పుడు తండ్రి పంపించిన డబ్బు ధారాళంగా వాడుకుంటున్నాడు. బట్టలు కూడా ఖరీదయినవి వేసుకుంటున్నాడు. తన తమ్ముడి క్కాడ మాసికలు వేసినవి తొడుక్కుంటున్నాడు. తోటి వాళ్ళంతా టెర్లిన్ చీరెలతో తిరుగుతుంటే తన చెల్లెళ్ళు పాపం—పేదవాళ్ళలా ఆ వెలిసిన గుడ్డలు కట్టుకోగా చూసిన రమణకు గుండెకోతగా వుంది.

వెళ్ళేనాడు తల్లి కాళ్ళకు దణ్ణం పెడుతూ "అమ్మా, నేను చదువు చాలించి ఉద్యోగం చూసుకుంటాను. అప్పుడు మనమంతా ఒకచోట ఉండవచ్చు. నీవు దిగులు పడకమ్మా నీ ముఖంలో నవ్వు చూసి ఎన్నాళ్ళయిందో? నీ నవ్వు ముఖం చూడటానికే నాన్నగారికి తెలియకుండా వచ్చానమ్మా" అన్నాడు తల దించుకుని.

"పిచ్చినాయనా! ఏళ్ళు మీద పడుతుంటే ముఖంలో వెనుకటి నవ్వులుంటాయా? నాకు దిగులేమిటి? మిమ్మల్నందరినీ చూసేవాడు పైన ఉన్నాడు. నా మాటకేం గాని బాగా చదువుకో నాన్నగారు ఆశించినట్టు పెద్ద ఉద్యోగం వస్తుంది. ఆరోగ్యం బాగా కాపాడుకో" దగ్గరికి తీసుకుని వీపు నిమిరింది. తల పక్కకు తిప్పుకుని కన్నీరు కొడుకు చూడకుండా రాల్చింది.

బరువెక్కిన గుండెతో రమణ బండెక్కాడు. తల్లి మాట్లాడిన ప్రతి మాట—ఆమె చూసిన చూపులు, ఆ వేషధారణ గుండెను పిండేస్తున్నాయి.

తండ్రిని ముఖాముఖి ఎదుర్కొని కుటుంబ సమస్యలను చర్చించబోతున్నాడు. ఆయనతో ఎట్లా మాట్లాడాలి? ప్రసంగధోరణి ఎట్లా ఉండాలి? ఇంతకాలం తండ్రి ఎదుటబడి ఒక్క మాట మాట్లాడి ఎరగడు. ఇప్పుడు తాను వెను కటి బాధ్యతలెరుగని రమణకాడు. తల్లి-ఇద్దరు చెల్లెళ్ళు-ఒక తమ్ముడు-కలిపి నలుగురి బాధ్యత వహించబోయే మనిషి.

ఉదయం తొమ్మిదిగంటల వేళ. రైలు దిగగానే హోటల్లో సామాను పెట్టుకుని స్నానం టిఫిన్ వగైరా పూర్తి చేసుకుని తండ్రి అడ్రసు చూసుకుని బయలుదేరాడు. ఇంటి ముందు తోట-గరాజిలో కారు-వరండాలో కుర్చీలు వాటి దగ్గర ఒక అల్సేషియన్ కుక్క, గేటు తెరచి లోపలికి వెళ్ళగానే నౌకరు ఎదురుగా వచ్చాడు రమణ కాగితం మీద తన పేరు వ్రాసి ఇచ్చాడు. ఆ చీటిని నౌకరు వరండాలో బల్ల మీద పెట్టి ఎగిరి పోకుండా బరువు పెట్టాడు.

రమణ కుక్కను బెదురు చూపులు చూస్తూ కుర్చీమీద కూర్చున్నాడు. పరదాలు ఎగిరినప్పుడల్లా డ్రాయింగు రూము అలంకరణంతా కనబడుతోంది. వరండాకు అటు పక్క గది - భోజనాల గది కాబోలు - కాఫీ టిఫిన్ తీసుకుంటున్నట్టు కప్పులలో - సాసర్లలో చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. రేడియో పాటలు నవ్వులు మాటలతో అరగంటకు పైగా గడిచింది.

నౌకర్ని పిలిచి చీటీ సంగతి జ్ఞాపకం చేశాడు.

"అయ్యగార్ని ఇప్పుడు మాట్లాడించటానికి వీలులేదు. బైటికి వచ్చినప్పుడు ఇస్తాను" అన్నాడు

రమణ గడియారం చూసుకున్నాడు. పది కావస్తోంది ఆఫీసుకు వెళ్ళేటప్పుడు చీటీ చూపిస్తాడు కదా అనుకున్నాడు

రమణ తల వంచుకుని వీధి తలుపువైపు చూస్తున్నాడు. మధ్య మధ్య తల్లిని తలుచుకుని బాధ పడుతున్నాడు. వసంతుని గురించి ఆలోచిస్తున్నాడు.

ఏదో చప్పుడు కాగా తలెత్తి చూశాడు. ఫుల్‌సూటులో తండ్రి బైటికి వచ్చి కారులో కూర్చుని తలుపు వేసుకున్నాడు. నైలాన్ చీరె - చేతులు లేని రవిక -

భుజాలు దాటని తలవెంట్రుకలూ సన్నగా పొడుగ్గా దంతపు బొమ్మలాంటి యువతి కారు దగ్గర నిలబడి లోపలికి తల పెట్టి "సాయంత్రం మాట మరచిపోవద్దు పార్టీ-తరువాత పిక్చరు." గునిసింది.

"నేనెట్లా మరిచిపోతాను? మన ప్రోగ్రాం సంగతి మరచిపోవటమే! నీవు ఈ లోపల పాటలు ప్రాక్టీసు చెయ్యి" చేతిని ఆమె బుగ్గలకు తాకించాడు.

రమణ విస్తుపోయి చూస్తున్నాడు అటువైపే-

కారు గేటు దాటి వెళ్ళగానే ఆమె వెనక్కి తిరిగి లోపలికి వెళ్తూ వరండా లోకి వచ్చి "ఎవరికోసం" అని అడిగింది.

చెప్పాడు రమణ తన పేరూ—ఎవరికోసం వచ్చిందీ!

ఆమె కనుబొమలు ముడుస్తూ "ప్రసాదరావుగారు సాధారణంగా ఇంట్లో ఎవరినీ కలవరు. అందరూ ఆఫీసుకే వెళ్ళి కలుస్తారు. ఇవాళ-రేపు అక్కడ కూడా కలవరు. ఏవో ఇంటర్వ్యూలు ఉన్నాయి" గిరుక్కున వెనక్కి మళ్ళి నౌకరుతో ఏదో చెప్పి లోపలికి వెళ్ళింది.

రమణ మెల్లగా లేచాడు. అటూ ఇటూ తిరిగి లంచ్ టైములో ఆఫీసుకు వెళ్ళాడు. ఆనాడు చాలా మందిని ఇంటర్వ్యూ చేసినట్టున్నారు. బారులు తీర్చి కూర్చున్నారు అందరూ. లంచ్ టైమయింది. ఆ తరువాత మరో పాతిక మందికి ఇంటర్వ్యూ.

లోపలికి తీసుకు వెళ్ళమని చీటీ ఇచ్చాడు రమణ జవాను చేతికి.

"ఇప్పుడు అయ్యగారు భోజనం చేసే వేళ. లోపలికి ఎవరూ పోకూడదు" అన్నాడు.

ఈ వేళ తప్పితే తండ్రిని కలవటానికి మరి ఆ రోజు వీల్లేదు. ఏదయితే అదవుతుందనుకుంటూ సాహసించి తండ్రి ఆఫీసు గది దాటి ప్రైవేటు రూము లోకి వెళ్ళాడు.

తండ్రి బల్లముందు కూర్చుని భోజనం చేస్తున్నాడు. మనిషి అలికిడి కాగానే తలెత్తి చూశాడు. ఆయనకు ఆశ్చర్యమూ, కోపమూ కలిగే లోపలే రమణ "నాన్నగారూ!" అన్నాడు.

"రమణా—నువ్వా? ఇదేమిట్రా ఈవేళప్పుడు ఇక్కడికి వచ్చావు? పరీక్షల ముందర ఈ ప్రయాణమేమిటి?" కాఠిన్యం కరడుకట్టిందా మాటల్లో.

రమణ ముఖం దించుకుని మాట్లాడలేకపోయాడు.

"మాట్లాడవేం? డబ్బు ప్రతి నెలా పంపుతూనే ఉన్నాగా! చాలటం లేదా? చాలకపోతే ఆ మాట రాయచ్చుగా. సిగరెట్లు-ఇంకా అటువంటి దురభ్యాసాలేమయినా చేసుకున్నావా? అయినా పరీక్షల ముందర ఈ తిరగటమేమిటి?" కళ్ళజోడు తీసి చేత్తో పట్టుకున్నాడు.

"నాకు అందరినీ చూడాలనిపించింది. అమ్మను చూసి మూడేళ్ళకు పైగా అయింది. అందుకని బయలుదేరాను."

"చిన్న పిల్లవాడివా-అమ్మమీద బెంగపెట్టుకోవటానికి? నీకు పరీక్షలు ముఖ్యం." అరిచినట్లుగా మాట్లాడాడు.

"పరీక్షలా? ఇక నేను చదవనూలేను—పరీక్షలు వ్రాయనూలేను."

"చదువుకోక ఏం చేస్తావురా చవటా. అడుక్కుతింటావా?"

"ఎందుకు అడుక్కుతింటాను? బి.ఏ ప్యాసయ్యాను. దానికి తగ్గట్టుగాచిన్న ఉద్యోగమేదయినా చూసుకుంటాను" పెడముఖం పెట్టాడు రమణ.

"ఉద్యోగం ఎవరిస్తారు ఈ రోజుల్లో? చూశావా వాకిట్లో ఎందరు ఉద్యోగం కోసం పడిగాపులు పడ్డారో?"

"పది మందికి ఉద్యోగాలివ్వగలిగిన మీరు నా కొకడికి ఇవ్వలేకపోవచ్చు. కాని ప్రపంచం చాలా విశాలమైనది."

"అసలు కారణమేమిటి? ఈ బుద్ధి నీకే పుట్టిందా?"

"నాకే పుట్టింది. మనిషికి పుట్టాల్సిన బుద్ధే పుట్టిందిగాని మరేం కాదు. నవ మాసాలూ మోసి కని-నన్ను కష్టపడి పెంచిన తల్లి బాధ్యత వహించాలి. ధనమూ హోదా ఉండి కూడా నా చెల్లెళ్ళూ తమ్ముడూ పేదరికం అనుభవిస్తున్నారు. వాళ్ళకు చదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేయాల్సిన బాధ్యత పెద్ద కొడుకుగా నాకున్నది.

మంచిది. వెళ్తాను. ఈ సంగతి చెప్పటానికే వచ్చాను." పళ్ళు కొరుకుతూ వెనక్కు మళ్ళాడు.

"వెళ్ళు. నీ కనవసరమైన వాటిల్లో జోక్యం కలిగించుకోకు. పెద్దమ్మవారు నెత్తిన కూర్చుంటే ఇలాంటి బుద్ధులే పుడతాయి. నిన్ను బాగు చెయ్యటం ఎవరి తరం?" గొణిగాడు తండ్రి.

వెనక్కు తిరిగాడు రమణ మళ్ళీ. "నా తల్లికి పిచ్చిదన్న పేరు పడేస్తేగాని మీకు ముందడుగు పడలేదు కదూ? ఆ పల్లెటూళ్ళో మీరిచ్చే భరణం తింటూ నా తల్లి ఒంటరిగా నానా తంటాలు పడుతున్నది. ఇవాళ్టినుంచీ నాకుతల్లి ఒక్కతే ఉందనుకుంటాను" గబగబా అడుగులు వేసుకుంటూ గది దాటాడు.

హోటలుకు వెళ్ళి భోజనం చేస్తుండగా, వాళ్ళ కుటుంబమిత్రుడు రంగారావు కనబడ్డాడు

"ఏమిటి రమణా–ఇక్కడ భోజనం చేస్తున్నావు?" నోరు తెరుచుకుని చూశాడు.

"ఏం లేదు ఊరికినే వచ్చాను" అన్నాడు ముభావంగా. అతడి మనసు వికలంగా ఉంది. ఎవరితో మాట్లాడటానికీ అంతగా మనసొప్పటంలేదు. మాటల మధ్యలో కుటుంబ విషయాలు కదుపుతారని భయం.

కాని—రంగారావు తనకు తెలిసినదంతా చెప్పే వరకూ ఆగలేదు.

"నీకు తెలిసిందా రమణా! మీ నాన్న మీ అమ్మను ఓ పల్లెటూళ్ళో ఉంచి భరణం పంపిస్తున్నాడు. చదువు చదువంటూ నిన్ను ఇక్కడికి రానివ్వటం లేదు. కూతుళ్ళకు సంబంధాలు చూసి పెళ్ళి చేయవలసిన వయసులో తానొక పాతికేళ్ళ పడుచును పెళ్ళిచేసుకున్నాడు ఆమె ఒక గాయకురాలు—ఆధునికచిలక. ఆమెతో పాట కచేరీలు—విందులు—పార్టీలు. అందరితో మీ అమ్మకు పిచ్చెక్కిందనీ హాస్పిటల్లో ఉంచానని చెబుతున్నాడు. పిల్లలను మేనమామల దగ్గిరికి పంపానంటున్నాడు. తనిటువంటి వేషాలు వేస్తుంటే ఆడపిల్లలకు సంబంధాలెట్లావస్తాయి? మీ గతి ఇట్లా పడుతుందనుకోలేదు రమణా! మీ తండ్రి ఎంత పెద్ద ఉద్యోగం చేస్తేనేం? బుద్ధులు చాలా చిన్నవి" దులిపినట్టు మాట్లాడాడు.

రమణకు తల నరాలు చిట్లిపోతున్నంత బాధ కలిగింది. తన తండ్రిని ఆశ్రయించుకుని ఆయన ఇచ్చే రూపాయి అర్ధకూ చెయ్యి చాపే రంగారావుకు తండ్రి ఎంత లోకువయిపోయాడు? అతడి నోటివెంట తనతండ్రి అల్పగుణాలను వినలేకపోయాడు.

అతడిని తప్పించుకుని రైలు స్టేషనుకు చేరుకున్నాడు.

ఇందుకా అమ్మను పిచ్చిదన్నారు? ఈ స్థితిలో కూడా నేర్పుగా ఓర్పుతో సంసారాన్ని చక్కబెడుతున్న తన తల్లి పిచ్చిదా? తన కిప్పటినుంచీ కనిపెంచిన తల్లి ఒక్కతే ఉన్నది. కడుపు తడిమి చూపి తన అమృతహస్తంతో అన్నంపెట్టే తల్లి మాత్రమే ఉన్నది. తన జీవితమంతా బిడ్డలకోసం-భర్తకోసం ఎన్నోత్యాగాలు చేసిన అనురాగమయిని వదిలిపెట్టి పిచ్చిదని ప్రవాదం లేపి, మరొక ఆధునిక యువతిని వివాహం చేసుకున్నవాడు ఇక నుంచీ తండ్రి కాడు అంతే అంతే. ఇదే తన నిర్ణయం-తుది నిర్ణయం అనుకుంటూ పిడికిళ్ళు బిగిస్తూ, పళ్ళు కొరుకుతూ టిక్కెట్టు తీసుకుని రైలెక్కాడు.

పెట్టె అంతా ఖాళీగా ఉంది. రమణ కాళ్ళు చాపుకుని పడుకున్నాడు. కాని కన్ను మూతపడలేదు. ఎప్పుడూ సంతోషంతో నవ్వుతూ తిరిగే తల్లి ఈనాడు ఒక శోకమూర్తి. పెనిమిటి ఉండే అనాథ. నలుగురు పిల్లలుగల తండ్రి-తన బాధ్యతనంతా విస్మరించి-భార్యను పిచ్చిదని అందరిచేతా నమ్మించి తిరిగి పెళ్లి కొడుకై సరససల్లాపాలలో మునిగి తేలుతున్నాడు. ఆయనలో మానవత్వము నశించింది. కాని—నవీన నాగరికత పెరుగుతున్నది రమణ ఆలోచనలకు దరీ దాపూ లేకుండా పోయింది.

తన తండ్రి తన దగ్గరనుండి ఏదో రహస్యం దాస్తున్నాడు అందుకే తననింటికి రానివ్వటంలేదు. ఏమిటా రహస్యం? రమణలో పెద్ద ఘర్షణ ప్రారంభ మయింది అది రహస్యాన్ని దాచటం కాదు-సిగ్గు పడటం. తన బలహీనత తన కొడుక్కు తెలిసిపోతుందేమోనన్న భయం. ఆ భయమే కోపం కిందికి మారుతున్నది.

పెద్ద ఉద్యోగము-హోదా-సంఘంలో గౌరవము సంపాదించాడు. తండ్రికి తనంటే భయమా? ఎందుకు? సంఘంలో తల ఎత్తుకుని తిరిగే తండ్రికి ఎదిగిన కొడుకంటే భయమా? తన ముందు తల ఎత్తుకుని తిరగలేడా?

రైలు దిగిన రమణ తన రూముకు గబగబా చేరుకున్నాడు. గది ఖాళీచేసి తిరుగు ప్రయాణానికి సంసిద్ధుడవుతున్నాడు.

(వనిత-స్త్రీల మాసపత్రిక)